క్లుప్తంగా

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

మంచాల: పీఆర్‌టీయూ టీఎస్ మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్‌ను ఎన్నుకున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ తెలిపారు. శనివారం మండల పరిధి నోముల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సంఘం రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా ఎండీ జావీద్, మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి పరమేష్, నాయకులు జమీర్, రాములు, సీతారాం నాయక్, రాజు, బాషయ్య, శ్రీను, లింగం తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస సామూహిక వ్రతాలు


వ్రతం చేస్తున్న భక్తులు

యాచారం: శ్రావణమాస శనివారాన్ని పురస్కరించుకుని మొండిగౌరెల్లి గ్రామం స్వయంభు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ.. నృసింహ స్వామి అంటే తమకు ఎనలేని విశ్వాసం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుర్రం చెన్నకేశవరెడ్డి, బాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, రవీందర్, శ్రీనువాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కడ్తాల్: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు, ఆలయ అభివృద్ధికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సంయుక్తంగా రూ.40 వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'గంప' ట్రస్ట్ చైర్మన్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా రూ.30 వేలు, 'రాధాకృష్ణ' ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ రూ.10 వేలను ఉత్సవ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, ఉత్సవ కమిటీ నాయకులు మల్లేశ్‌గౌడ్, చేగూరి రాములు, టీక్‌లాల్‌నాయక్, కృష్ణనాయక్, మహేశ్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, బిక్కునాయక్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలకు రూ.10లక్షల వరకూ వైద్యాన్ని ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుపేదల ఆరోగ్యభద్రతే లక్ష్యమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్‌సాధిక్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణ, సుదర్శన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారికి పసిడి

షాబాద్: కరాటే పోటీల్లో చిన్నారి గోల్డ్ మెడల్ సాధించింది. లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల విజయ్ శేఖర్, ప్రభావతి కూతురు జ్ఞానతేజ శనివారం బెంగళూరులో జరిగిన ఓపెన్ శివ మొగ్గ ఇంటర్నేషనల్ స్థాయి కరాటే పోటీల్లో ప్రథమస్థానంతో గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. మొయినాబాద్‌లో సుజాత ఇంటర్నేషనల్ స్కూల్లో మూడోతరగతి చదువుతుంది. మెడల్ సాధించిన చిన్నారిని కరాటే మాస్టర్ సింహన్, సుధాకర్ అభినందించారు.


ఇబ్రహీంపట్నం: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


కడ్తాల్‌లో.. చిన్నారులు, ఉపాధ్యాయులు


ఆమనగల్లులో.. విద్యార్థులు

ఘనంగా గోకులాష్టమి

- కన్నయ్య, గోపికల వేషధారణతో ఆకట్టుకున్న చిన్నారులు
- ఉత్సాహంగా ఉట్లు కొట్టిన విద్యార్థులు

కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ముందస్తుగా పలు పాఠశాలల్లో జన్మాష్టమి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఆటపాటలతో విద్యార్థులు నృత్యరూపకంగా చక్కగా అభినయించారు. బుడిబుడి అడుగులతో ఉత్సాహంగా ఉట్లు కొట్టగా.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తంచేశారు.

–సాక్షి, నెట్‌వర్క్


ఇబ్రహీంపట్నం: గోపిక వేషధారణలో..


ఆమనగల్లులో.. ఉట్లు కొడుతున్న చిన్నారులు


అబ్దుల్లాపూర్‌మెట్: అనాజీపూర్ ప్రభుత్వ పాఠశాలలో కన్నయ్య, గోపికల వేషధారణలో


ఆమనగల్లులో.. విద్యార్థులు

ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టి..

ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

యాచారం: ఆగిఉన్న వాహనాన్ని బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాల్ గ్రామానికి చెందిన శ్యామల శివకోటి(21) వరుసకు తమ్ముడైన విష్ణుతో కలిసి మంచాల మండలం నోముల గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో క్రీడా ప్రాంగణం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బలమైన గాయాలవ్వడంతో శివ అక్కడికక్కడే మృతి చెందగా.. విష్ణుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పోలీసులు పట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'రోడ్డుకు మరమ్మతులు చేయించండి'

కొత్తూరు: పట్టణానికి కిలో మీటర్ దూరంలోని కేజీబీవీ హాస్టల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతు చేయించాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి శనివారం అధికారులను కోరారు. రోడ్డుకు మరమ్మతులు చేయించకపోవడంతో అధ్వానంగా మారిందన్నారు. విద్యార్థులు హాస్టల్ నుంచి పట్టణం వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని, త్వరగా రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరారు.

టెక్నాలజీలో పురోగతి సాధించాలి

జేఎన్‌టీయూహెచ్ యూజీసీ డైరెక్టర్ డాక్టర్ విశ్వనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

ఇబ్రహీంపట్నం రూరల్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక రంగంలో పురోగతి సాధించాలని జేఎన్‌టీయూహెచ్ యూజీసీ డైరెక్టర్ డాక్టర్ జీకే విశ్వనాథ్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్‌గూడ సమీపంలోని విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితే జీవితంలో సులభంగా స్థిరపడవచ్చునని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వంగీపురం శ్రీనాథచారి, కళాశాల సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కన్నయ్య శెట్టి, కోశాధికారి రాములు, ప్రిన్స్‌పాల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురునానక్ విద్యాసంస్థలో..

విద్యార్థి దశలో ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని ఉన్నతంగా స్థిరపడాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. పట్నం మున్సిపాలిటీ పరిధి గురునానక్ విద్యాసంస్థలో నూతనంగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలానికి అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని చెప్పారు. క్రమశిక్షణ, అంకితభావంతో విద్యనభ్యసిస్తే సాధించనిదంటూ ఏమీ లేదని, ముఖ్యంగా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించాలని చెప్పారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్, యూనివర్సిటీ చాన్స్‌లర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి, ఎండీ ఎస్‌హెచ్ శైనీలు మాట్లాడుతూ నాలుగేళ్ల విద్యాభ్యాసం విజయవంతంగా ముగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురునానక్ గురునానక్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనాథరెడ్డి, డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, ప్రిన్స్‌పాల్ వెంకటరావు, డాక్టర్ పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్ రిషి సయాల్, డీన్ రంగనాయకులు, కేదర్నాథ్, వినయ్‌చోప్రా, మాజీద్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పనికి వెళ్లిన మహిళ అదృశ్యం


సరోజ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: పని కోసం ఇంట్లోంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం టికార్ గ్రామానికి చెందిన జమేష్, సరోజ అలియాస్ అంజున(27) తమ 3 ఏళ్ల పాపతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వలస వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా సరోజ ఇనాంగూడ శివారులోని చాచా దాబా పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణంలో పనిచేస్తుండగా, ప్రతి రోజు మాదిరిగానే ఈ నెల 21న ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి పోయింది. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో ఆమె పనిచేసే చోటుకు భర్త జమేష్ వెళ్లగా అక్కడి నుంచి కూడా వెళ్లిపోయిందన్నారు. దీంతో ఆయన బంధువులు ఇళ్లతో పాటు పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం రాత్రి జమేష్ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెండా దిమ్మె ధ్వంసం.. చర్యలకు డిమాండ్


సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: పట్నం చెరువు కట్టపై ఉన్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం జెండా దిమ్మెను ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడారు. దిమ్మెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం నాయకులు నాగార్జున, శ్రీనివాస్, మహిళా విభాగం కన్వీనర్ నిర్మల ఉన్నారు.

రూ.2 వేల కోట్లతో 'ది స్క్వేర్' ప్రాజెక్ట్

ఆదిబట్లలో ప్రారంభించిన ఐరా రియల్టీ


ప్రారంభించిన విల్లా

ఇబ్రహీంపట్నం, రూరల్: నగరానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఐరా రియల్టీ ఆదిభట్లలో రూ.2 వేల కోట్ల విలువైన 'ది స్క్వేర్' విల్లా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఐరా రియాల్టీ చైర్మన్ నర్సిరెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. 13.5 ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో 131 యూనిట్ల 4బీహెచ్‌కే డూప్లెక్స్ విల్లాలుంటాయి. ప్రతి విల్లాలో హోమ్ ఆటోమేషన్, ల్యాండ్ స్కేప్డ్ గార్డెన్ వంటి ఆధునిక వసతులన్నీ ఉంటాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో లగ్జరీ విల్లా ప్రాజెక్టుకు డిమాండ్ పెరిగిందని నర్సిరెడ్డి తెలిపారు. నగరవాసులు ఇల్లు మాత్రమే కాకుండా పూర్తి ఆధునిక జీవనశైలి అనుభవాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. పెరుగుతున్న ట్రెండ్‌కు తగినట్టు లగ్జరీ, గోప్యత, సౌలభ్యాన్ని మిళితం చేసే జీవనశైలిని అందించడంతో పాటు వంద శాతం వాస్తు ఆధారిత విల్లాలను నిర్మిస్తున్నామని వివరించారు. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్లబ్‌హౌస్ ఉంటుందని, ఇందులో జిమ్, స్విమ్మింగ్ పూల్, బాంక్వెట్ హాల్ వంటి అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న బాలసభ


విద్యా బోధన చేస్తున్న విద్యార్థినులు

తలకొండపల్లి: విద్యార్థులు నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది. మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలలో వందే మాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బాలసభ నిర్వహించారు. ఇందులో విద్యార్థినులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటివారికి పాఠాలు చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో స్పెషల్ ఆఫీసర్ రేణుక, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ వలంటీర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


మాడ్గులలో..

చిన్నారులకు అభినందనలు

మాడ్గుల: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేజీబీవీలో నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ప్రతి శనివారం బాలసభ నిర్వహిస్తున్నారు. ఇందులో విద్యార్థినులే డీఈఓ, ఎంఈఓగా వ్యవహరించడంతో పాటు.. సహ విద్యార్థినులకు పాఠాలు బోధిస్తారు. కాగా.. సభలో ప్రతిభ చూపిన చిన్నారులను ఎస్‌ఓ రేఖ అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విజయ్, ఉపాధ్యాయులు, అక్షర జ్యోతి కోఆర్డినేటర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తప్పవని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని వీరన్నపేట, గాలిగూడ గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతీ విద్యార్థికి ఉచిత యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు అందజేశారా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను సరిచూశారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు


బోనాల ఊరేగింపు

ఆమనగల్లు: కంత మహేశ్వర స్వామి బోనాల పండుగ వైభవంగా జరిగింది. కడ్తాల్ మండల కేంద్రంలోని ఆలయంలో శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా స్వామి వారి సన్నిధికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, సభ్యులు యాదయ్యగౌడ్, కేశవులుగౌడ్, శివగౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, హరీష్‌గౌడ్, మహేందర్‌గౌడ్, నాయకులు నర్సింహ, సత్యంయాదవ్, జహంగీర్ అలీ, బిక్షపతి, యాదయ్య పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కంపుకంపు

ఏడో వార్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ


రోడ్డుపై మురుగు జలాలు

యాచారం: డ్రైనేజీ కంపు కొత్తపల్లి గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. మురుగు జలాలతో వస్తున్న దుర్వాసనకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మురుగు కాలువలు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయని, దీంతో ఇంట్లో ఉండలేక, వీధుల్లో నడవలేక ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని, తద్వారా విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే పలువురు వైరల్ ఫీవర్‌తో ఆస్పత్రుల పాలయ్యారని వెల్లడించారు. ఇదే విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేక అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


హోమంలో పాల్గొన్న భక్తజనం

తలకొండపల్లి: పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. మండల పరిధి చెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో శనివారం విగ్రహం ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. పండితులు నర్సింహ్మయ్య శర్మ, యాదగిరిల వేద మంత్రోచ్ఛారణలతో కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. అంతకు ముందు ఆలయంలో యజ్ఞ హోమం, అఖండ దీపారాధన, ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌ను సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, లక్ష్మీనారాయణ గౌడ్, సదానందం గౌడ్, నరేందర్ గౌడ్, వెంకటయ్య, రామస్వామి, అంజయ్య, రాజేందర్, చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు రెడీ



పోచమ్మ ఆలయం (ఇన్‌సెట్లో) పోచమ్మ అమ్మవారు

- నేడు ఊర పోచమ్మ వేడుకలు
- ఇబ్రహీంపట్నంలో పండుగ వాతావరణం

ఇబ్రహీంపట్నం: ఊర పోచమ్మ బోనాలకు ఇబ్రహీంపట్నం సిద్ధమైంది. పట్టణమంతా రోడ్లకిరువైపులా విద్యుత్ దీపాలను అమర్చి, మైక్‌లు ఏర్పాటు చేశారు. భారీ స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాల కాంతితో.. అమ్మవారి చిత్రాలను ప్రధాన కూడళ్ల వద్ద ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రంగులు వేసి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. పట్నంలో ఏటా ఆషాఢమాసంలో మహంకాళి, శ్రావణ మాసంలో పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం జరిగే వేడుకల నేపథ్యంలో ఇప్పటికే ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. ఆడపడుచులు, దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు గ్రామానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి పూజ, అమ్మవారికి ఒడి బియ్యం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి తల్లికి బోనాలు సమర్పిస్తారు. సాయంత్రం జరిగే సామూహిక బోనాల ర్యాలీ కన్నుల పండువగా కొనసాగనుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి



భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద పంపిణీ ఉంటుంది. గ్రామస్తులు, భక్తులు సహకరించి వేడుకలను విజయవంతం చేయాలి.

– ముత్యాల భాస్కర్, ఉత్సవాల చైర్మన్

ప్రశాంతంగా జరుపుకోవాలి



బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించబోం.

– సత్యనారాయణ, సీఐ